

స్థిరంగా చీనీ ధరలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.18 వేలు పలికాయి.



టమాట కిలో రూ.45

అనంతపురం కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ట ధర రూ.45 పలికింది. కనిష్టం రూ.32, సరాసరి రూ.38 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
37.7°/22.4°

జిల్లా అంతటా బుధవారం పగటి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉక్కపోత పెరిగింది. అక్కడక్కడా తేలికపాటి నుంచి తుంపర్లు పడ్డాయి.

న్యూస్‌రీల్

ఇద్దర్ని మింగిన నీటి కుంట



మృతి చెందిన విద్యార్థి విష్ణువర్దన్



మృతి చెందిన యువకుడు నవీన్

కుందుర్పి: నీటికుంటలో పడి ఇద్దరు మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు..కుందుర్పికి చెందిన సజ్జల అంగడి నాగేంద్ర, అనిత దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె సంతానం. చిన్న కుమారుడు విష్ణువర్దన్ (11) స్థానిక జెడ్పీ హైస్కూల్లో 6వ తరగతి చదువుతున్నాడు. బుధవారం ఉదయం 11 గంటల సమయంలో పాఠశాలకు పక్కనే ఉన్న భద్రకుంట వద్దకు విష్ణువర్దన్ బహిర్భూమికి వెళ్లాడు. ఈ క్రమంలోనే కుంటలో కాళ్లు శుభ్రం చేసుకుంటుండగా చెప్పు నీటిలో పడింది. దాన్ని తీసుకొనే ప్రయత్నంలో కాలుజారి నీటిలో పడిపోయాడు. ఆ సమయంలో అటుగా వెళుతున్న రామాచారి కుమారుడు నవీన్ (24) విష్ణువర్దన్‌ను కాపాడేందుకు వెంటనే కుంటలోకి దూకాడు. ఈత రాకపోవడంతో ఇద్దరూ నీట మునిగిపోయారు. అక్కడే ఉన్న విష్ణువర్దన్ తోటి విద్యార్థులు వెంటనే పరుగున వెళ్లి సమాచారాన్ని ఉపాధ్యాయులకు చేరవేశారు. వారు గ్రామస్తుల సాయంతో ఇద్దరినీ బయటకు తీయగా, అప్పటికే నవీన్ ప్రాణాలు కోల్పోయాడు. కొనఊపిరితో కొట్టుమిట్టాడుతున్న విష్ణువర్దన్‌ను కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించేలోపు మృతి చెందాడు. రామాచారికి నవీన్ మూడో కుమారుడు అని తెలిసింది. ఒకే రోజు ఇద్దరి మృతితో కుందుర్పిలో విషాదం నెలకొంది. బాధిత కుటుంబాలు దుఃఖసాగరంలో మునిగిపోయాయి. విష్ణువర్దన్ మృతదేహం వద్ద తల్లిదండ్రులు విలపించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటస్వామి తెలిపారు.

ఐటీఐ ప్రవేశాలకు రెండో విడత దరఖాస్తు

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో 2024-25 విద్యా సంవత్సరం రెండోవిడత ప్రవేశాలకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని అనంతపురం బాలుర ఐటీఐ ప్రిన్సిపాల్ రామమూర్తి కోరారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. iti.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా ఈనెల 24లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. సర్టిఫికెట్లను సమీపంలోని ఐటీఐలలో వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. ప్రభుత్వ ఐటీఐలకు 27, 28 తేదీల్లో, ప్రైవేట్ ఐటీఐలకు 29,30 తేదీల్లో కౌన్సెలింగ్ ఉంటుందని పేర్కొన్నారు.

శిక్షణ తరగతులు సక్రమంగా నిర్వహించాలి : కలెక్టర్



సూచనలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్


అనంతపురం రూరల్: పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న వారికి ఏర్పాటు చేసే శిక్షణ తరగతులు సక్రమంగా నిర్వహించాలని బీసీ స్టడీ సర్కిల్ ఉప సంచాలకులు కుష్బూకొఠారికి కలెక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. బుధవారం బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. అన్ని రకాల పోటీ పరీక్షలకు శిక్షణ ఇవ్వడానికి సిద్ధంగా ఉండాలన్నారు. ఉచిత శిక్షణకు హాజరయ్యే ప్రతి ఒక్కరూ పోటీ పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించేలా శిక్షణ కొనసాగాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది రవికుమార్, తదితరులున్నారు.

జీతాలివ్వండి మహాప్రభో

సమగ్ర శిక్ష పరిధిలో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు జీతాల కోసం ఎదురుచూస్తున్నారు. కూటమి ప్రభుత్వం రాగానే ప్రతినెలా రెగ్యులర్ ఉద్యోగులతో పాటు కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఠంచన్‌గా జీతాలు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామని గతంలో టీడీపీ నాయకులు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి రెండో నెల నడుస్తోంది. మే, జూన్ నెలల జీతాలు ఇప్పటిదాకా మంజూరు కాలేదు. దీంతో ఉద్యోగులు విలవిలలాడుతున్నారు.

- సమగ్ర శిక్ష కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు అందని మే, జూన్ జీతాలు
- కుటుంబ నిర్వహణకు తీవ్ర ఇబ్బందులు
- పిల్లల ఫీజుల కోసం ఇక్కట్లు
- అప్పులు కూడా పుట్టడం లేదంటున్న బాధితులు





అనంతపురం ఎడ్యుకేషన్: ఉమ్మడి అనంతపురం జిల్లావ్యాప్తంగా సమగ్రశిక్ష విభాగంలో 2,800 మంది పనిచేస్తున్నారు. కేజీబీవీల్లో ప్రిన్సిపాళ్లు, సీఆర్టీలు, పీజీటీలు, పీఈటీలు ఉన్నారు. వీరితో పాటు నాన్ టీచింగ్ ఉద్యోగులుగా కంప్యూటర్, ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్లు, అటెండర్లు, అకౌంటెంట్లు, వాచ్‌మన్లు, కుక్‌లు, ఏఎన్‌ఎంలు, ఎమ్మార్సీల్లో ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, డేటాఎంట్రీ ఆపరేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, అకౌంటెంట్లు, మెసెంజర్లు, సీఆర్పీలు, పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లు, భవిత కేంద్రాల్లో ఐఈఆర్పీలు, ఫిజియోథెరపిస్టులు, ఆయాలు, జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్లు, అటెండర్లు, సైట్ ఇంజినీర్లతో పాటు డీఎంఎల్‌టీలు పని చేస్తున్నారు.

జీతాలందక అగచాట్లు..

గత రెండు నెలలుగా వీరికి జీతాలందలేదు. దీంతో ఉద్యోగుల బాధ వర్ణనాతీతంగా మారింది. చాలీచాలని జీతాలతో కుటుంబాల నిర్వహణ అంతంత మాత్రంగానే ఉంటుంది. ఇదే క్రమంలో సక్రమంగా వేతనాలు రాకపోవడంతో నిత్యావసర సరుకుల కొనుగోలుకు కూడా ఇబ్బందులు పడుతున్నారు. ఇంటి అద్దెలూ చెల్లించలేదంటున్నారు. దీనికితోడు జూన్ నెల వచ్చిందంటే పిల్లల స్కూల్ ఫీజులు, పుస్తకాల కొనుగోలు, యూనిఫాం తదితర ఖర్చులు తడిసిమోపెడవుతాయి. ఇలాంటి సమయంలో జీతాలు రాకపోతే తమ పరిస్థితి ఎలా ఉంటుందో ప్రభుత్వం ఆలోచించాలని అంటున్నారు. అప్పులు కూడా పుట్టడం లేదని వాపోతున్నారు. జీతాలు ఎప్పుడొస్తాయనేది కచ్చితంగా చెప్పలేకపోవడంతో రుణదాతలు కూడా అప్పులివ్వడానికి ఆసక్తి చూపడం లేదు. కొందరు ఎంఈఓలు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయుల సహకారంతో చేతిబదులు ఇచ్చారని చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు స్పందించి చిరుద్యోగులైన తమపట్ల వివక్ష చూపకుండా, జీతాలు సక్రమంగా చెల్లించేలా చూడాలని విన్నవిస్తున్నారు.

చేతిలో చిల్లిగవ్వ లేదు..



మావి అంతంతమాత్రం జీతాలు. ఇవికూడా సక్రమంగా రాకపోతే ఎలా? జూన్‌లో స్కూళ్లు, కళాశాలలు తెరిచారు. పిల్లల చదువుల ఫీజులు, బుక్స్ కొనేందుకు చేతిలో చిల్లిగవ్వ లేదు. అప్పులూ పుట్టడం లేదు. ప్రభుత్వం అప్పగించిన పనులు ఎప్పటికప్పుడు చేస్తున్నాం. జీతాల విషయం వచ్చే సరికి ఇబ్బందులు పడుతున్నాం. సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ప్రతి కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగికి వెంటనే జీతాలు మంజూరు చేయాలి. – అంజనరాజు, సీఆర్పీల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు

ఇంటి అద్దె కూడా కట్టలేదు



రెండు నెలలుగా జీతాలు రాక సమగ్ర శిక్ష పరిధిలోని కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల్లో చాలామంది ఇంటిఅద్దెలు కూడా కట్టలేదు. పిల్లల చదువుల ఫీజుల చెల్లింపునకు ఇక్కట్లు పడుతున్నారు. అప్పులు కూడా పుట్టడం లేదు. పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ చూపి కష్టాలు తీర్చాలి.

– కె.విజయ్, చైర్మన్, సమగ్ర శిక్ష ఉద్యోగుల జేఏసీ,ఉమ్మడి అనంతపురం జిల్లా

ఖరీఫ్ సాగుపై జేడీఏ సమీక్ష

అనంతపురం అగ్రికల్చర్: ప్రస్తుత ఖరీఫ్‌లో సాగైన పంటలు, వాటి స్థితిగతులపై బుధవారం స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో ఏడీఏలతో జేడీఏ ఉమామహేశ్వరమ్మ సమీక్షించారు. మండలాల వారీగా సాధారణ సాగు, సాగైన పంటల విస్తీర్ణం, వర్షపాతం, సాగులోకి ఎంత వచ్చే అవకాశం, ప్రత్యామ్నాయ ప్రణాళిక తయారీ తదితర అంశాలపై సమీక్షించారు. వర్షాభావ పరిస్థితులతో ఖరీఫ్ మందకొడిగా సాగుతున్నట్లు ఏడీఏలు తెలిపారు. ఇంకా సమయం ఉండటం, వర్షసూచన ఉన్నందున సాగు విస్తీర్ణం పెరిగే పరిస్థితి ఉందన్నారు. రైతు సేవా కేంద్రాల వారీగా, పంటల వారీగా వెంటనే సాగు విస్తీర్ణం వివరాలు అందజేయాలని జేడీఏ ఆదేశించారు. పీఎం కిసాన్‌కు సంబంధించి 5 శాతం ఫిజికల్ వెరిఫికేషన్ చేయాలన్నారు. ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల అమ్మకాలపై నిఘా ఉంచడంతో పాటు తనిఖీలు కొనసాగించాలన్నారు. లక్ష్యం మేరకు వాటి నమూనాలు తీసి పంపాలని ఆదేశించారు. మట్టి నమూనాలు భూసార పరీక్షా కేంద్రానికి పంపాలని సూచించారు.

గుంతకల్లు డీఆర్‌ఎంగా విజయ్‌కుమార్

గుంతకల్లు: గుంతకల్లు రైల్వే డివిజనల్ మేనేజర్ (డీఆర్‌ఎం)గా ఎం.విజయ్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు రైల్వే బోర్డు సెక్రటరీ దివాకర్ డి రుడేలా బుధవారం ఉత్తర్వులు విడుదల చేశారు. ప్రస్తుత డీఆర్‌ఎం వినీత్‌సింగ్ అవినీతి కేసుల్లో సీబీఐ వలలో చిక్కుకుని రిమాండ్‌లో ఉన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో సికింద్రాబాద్ డివిజన్‌లో చీఫ్ మెకానికల్ ఇంజినీరింగ్ ప్లానర్‌గా ఉన్న విజయ్‌కుమార్‌ను డీఆర్‌ఎంగా నియమించారు. విజయ్‌కుమార్ నియామకానికి రాష్ట్రపతి అనుమతి ఇవ్వడంతో ఉత్తర్వులు జారీ చేసినట్లు రైల్వే బోర్డు సెక్రటరీ పేర్కొన్నారు. నూతన డీఆర్‌ఎం శుక్రవారం బాధ్యతలు తీసుకుంటారని డివిజన్ కార్యాలయ వర్గాల ద్వారా తెలిసింది.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం

- టీడీపీ నాయకుల దాడిలో గాయపడ్డ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు భరోసా



వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు చెక్కులు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ, పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా

ఉరవకొండ: వైఎస్సార్ సీపీ శ్రేణులకు అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య అన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత ఉరవకొండ నియోజకవర్గంలో టీడీపీ నాయకులు రెచ్చిపోయారు. వైఎస్సార్ సీపీ శ్రేణులపై దాడులకు పాల్పడ్డారు. ఈ క్రమంలో పార్టీ శ్రేణులకు భరోసా కల్పిస్తూ టీడీపీ దాడుల్లో తీవ్రంగా గాయపడిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్థిక సాయం అందించారు. ఈ మేరకు చెక్కులను బుధవారం అనంతపురంలోని విశ్వ స్వగృహంలో బాధితులకు పంపిణీ చేశారు. ఉరవకొండ మేజర్ పంచాయతీ ఉపసర్పంచ్ వన్నప్ప, పార్టీ పట్టణ నాయకులు వేమన్న, శ్రీకాంత్‌కు చెరో రూ.50 వేల చెక్కులను అందించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే విశ్వ, పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అధైర్య పడొద్దన్నారు. పార్టీ ఎల్లప్పుడూ వారికి అండగా ఉంటుందన్నారు. టీడీపీ దాడులు కొనసాగిస్తే తీవ్రంగా ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మూల గిరిపల్లి ఓబన్న తదితరులు పాల్గొన్నారు.

28 తర్వాతే హెచ్చెల్సీకి నీటి విడుదల

కణేకల్లు/బొమ్మనహాళ్: హెచ్చెల్సీకి ఈనెల 28 తర్వాతే నీటిని విడుదల చేసే అవకాశముందని ఎస్‌ఈ రాజశేఖర్ తెలిపారు. కణేకల్లు చిక్కణ్ణేశ్వర స్వామి చెరువు అవుట్‌ఫ్లో రెగ్యులేటర్లను, బొమ్మనహాళ్ మండలంలోని దేవగిరి క్రాస్, డీ హీరేహాళ్ మండలంలో జరుగుతున్న కాలువ మరమ్మతు పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీబీ డ్యాం నీటిమట్టం 40 టీఎంసీలకు చేరుకోగానే హెచ్చెల్సీకి నీరు విడుదల చేస్తామని తుంగభద్ర బోర్డు అధికారులు చెప్పారన్నారు. మరో 15 రోజుల్లో ఆ మేరకు నీరు డ్యాంకు చేరుకోవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. హెచ్చెల్సీలో అత్యవసర పనుల కోసం రూ.2.92 కోట్లతో ప్రతిపాదనలు పంపామన్నారు. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తామన్నారు. అవుట్‌ఫ్లో రెగ్యులేటర్ బ్రిడ్జి గతేడాది కుప్పకూలిపోగా రాకపోకల కోసం ఆ ప్రదేశంలో మట్టిని నింపామన్నారు. హెచ్చెల్సీకి ఈ నెలాఖరులో నీరు విడుదలయ్యే అవకాశముండటంతో మట్టిని సత్వరమే తొలగించాలని హెచ్చెల్సీ సబ్ డివిజన్ అధికారులను ఆదేశించారు. గంగలాపురం మార్గంలో పొలాలున్నాయని, ఎరువులు అటువైపు తీసుకెళ్లేందుకు కొన్ని రోజులు అవకాశమివ్వాలని రైతులు విజ్ఞప్తి చేయడంతో ఎస్‌ఈ అంగీకరించారు. మట్టి తొలగింపు పనులు చాలా జాగ్రత్తగా చేపట్టాలని, అవుట్‌ఫ్లో రెగ్యులేటర్లు ఏమాత్రం దెబ్బతినకుండా చూడాలన్నారు.



తుంగభద్ర జలాశయం

హెచ్చెల్సీ 119/638 కిలోమీటర్ వద్ద యూటీ (అండర్ టన్నెల్), 112/100 కిలోమీటర్ వద్ద గండి పూడ్చివేత పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. మరో రెండు, మూడ్రోజుల్లో పనులు పూర్తవుతాయని చెప్పారు. పీఏబీఆర్, ఎంపీఆర్, చాగల్లు రిజర్వాయర్లలో 6 అత్యవసర పనులను గుర్తించామని, హెచ్చెల్సీ కెనాల్ పరిధిలో 19 పనులను అత్యంత అవసరమని గుర్తించి రూ.2.92 కోట్లతో ప్రతిపాదనలు పంపామన్నారు. అలాగే, అర్ధంతరంగా ఆగిపోయిన స్ట్రక్చర్ (బ్రిడ్జిలు) పనులు, వివిధ రెగ్యులేటర్ల నిర్మాణం, కూలిపోయిన బ్రిడ్జిల నిర్మాణం కోసం రూ.34 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపామని, నిధులు మంజూరైతే హెచ్చెల్సీకి ఈ ఏడాది నీరు నిలిచిన తర్వాత పనులు ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో ఈఈ వెంకటరమణరెడ్డి, డీఈఈ మద్దిలేటి, తదితరులు పాల్గొన్నారు.

టీబీ డ్యాంలో 25 టీఎంసీల నీరు

బొమ్మనహాళ్: కర్ణాటకలోని హొస్పేట్ వద్ద ఉన్న తుంగభద్ర జలాశయంలో నీటి నిల్వ 25.173 టీఎంసీలకు చేరింది. ఇన్‌ఫ్లో బుధవారం ఉదయానికి 27,544 క్యూసెక్కులుగా నమోదైంది.అవుట్‌ఫ్లో 199 క్యూసెక్కులుగా ఉంది. 1,633 అడుగుల డ్యాం ఎత్తుకు గాను 1,602.67 అడుగుల వరకు నీరు చేరాయి. జలాశయానికి ఎగువన ఉన్న శివమొగ్గ, శృంగేరి, తీర్థనహళ్లి, ఆగుంబే తదితర ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. గతేడాది ఇదే సమయానికి డ్యాంలో 1,578.79 అడుగులతో 3.911 టీఎంసీల నీరు ఉండింది.

కందిపప్పు, సోనామసూరి విక్రయాలు

- రైతు బజార్‌లో ప్రత్యేక కౌంటర్ల ఏర్పాటు

అనంతపురం అర్బన్: రైతుబజార్‌లో ప్రత్యేక కౌంటర్ల ద్వారా గురువారం నుంచి కందిపప్పు, సోనామసూరి బియ్యం విక్రయాలు చేపడుతున్నట్లు జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ చెప్పారు. బుధవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులు, డీలర్లు, మిలర్ల సంఘం ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కందిపప్పు (దేశవాళి రకం) కిలో రూ.160, బియ్యం బీపీటీ లేదా సోనామసూరి ఫైన్ రైస్ రకం కిలో రూ.49, ముడి రకం రూ.48తో విక్రయించాలని సమావేశంలో నిర్ణయించారు. డీ మార్ట్, రిలయన్స్, విశాల్ మెగా మార్ట్, మోర్ అవుట్‌లెట్లలోనూ బియ్యం, కందిపప్పు స్థిరమైన ధరలకు విక్రయించాలని వాటి ప్రతినిధులకు సూచించారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి శోభారాణి, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ రమేష్‌రెడ్డి, మార్కెటింగ్ ఏడీ సత్యనారాయణ చౌదరి, రైతు బజార్ ఎస్టేట్ అధికారి రుద్ర ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.



జేసీ కేతన్‌గార్గ్

కొలువు దీరిన కుళ్లాయిస్వామి

నార్పల: మొహర్రం ఉత్సవాల్లో భాగంగా గూగూడు కుళ్లాయి స్వామి కొలువుదీరారు. బుధవారం తెల్లవారుజామున స్వామి వారిని పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. సన్నాయి వాయిద్యాల నడుమ 3 గంటల సమయంలో పీర్ల మకాంలో కొలువు చేశారు. రాత్రి 9 గంటల నుంచి కుళ్లాయి స్వామి పీరుతో పాటు మిగిలిన పీర్లను అలంకరణ చేశారు. ఈ సందర్భంగా భక్తాదులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. గూగూడు బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆంజనేయస్వామికి కూడా ప్రత్యేక పూజలు జరిగాయి. కార్యక్రమంలో సర్పంచు రమణకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ శివశంకర్‌రెడ్డి, ఈఓ శోభ, కో ఆప్షన్ సభ్యుడు షాబీరా, ఎంపీటీసీ రాజారెడ్డి, నాయకులు గోపాల్, శివయ్య తదితరులు పాల్గొన్నారు.



గూగూడులో కొలువైన కుళ్లాయిస్వామి

కుమారుడికి అర కోటి కారు గిఫ్ట్

- 'చీటి'ంగ్ టీచరు కాకర్ల దివాకర్‌నాయుడి లీలలు

అనంతపురం ఎడ్యుకేషన్: చీటీల పేరుతో కుచ్చు టోపీ పెట్టిన స్థానిక రాజేంద్ర నగరపాలక ఉన్నత పాఠశాల తెలుగు గ్రేడ్-2 టీచరు కాకర్ల దివాకర్‌నాయుడు అప్పుల బాగోతం ఒక్కొక్కటీ వెలుగు చూస్తోంది. ఇంజినీరింగ్ చదివే తన కుమారుడికి అర కోటి రూపాయలకు పైగా విలువైన కారును గిఫ్ట్‌గా ఇచ్చినట్లు సన్నిహితులు చెబుతున్నారు. కొడుకు ఆనందం కోసం తమ నెత్తిన బండ వేశాడంటూ బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాకర్ల దివాకర్‌నాయుడు కోట్లాది రూపాయలు ముంచేసి కుటుంబంతో ఉడాయించాడంటూ కొందరు బాధితులు ఇటీవల ఎస్పీ, కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని బుధవారం 'సాక్షి' 'ప్రభుత్వ టీచరు చీటింగ్' శీర్షికతో వెలుగులోకి తెచ్చింది. రూ. 10 కోట్ల వరకు చీటీల డబ్బులు, వడ్డీ డబ్బులు దివాకర్ నాయుడు బాకీ పడ్డట్లు తెలుస్తోంది.

ఆర్‌ఎంహెచ్‌ఎస్ స్కూల్‌కు వస్తున్న బాధితులు..

'సాక్షి'లో ప్రచురితమైన కథనం చూసేవరకు చాలామంది బాధితులకు దివాకర్ నాయుడు అజ్ఞాతంలోకి వెళ్లాడనే విషయం తెలీదు. బుధవారం పలువురు ఆర్‌ఎంహెచ్‌ఎస్ స్కూల్ వద్దకు వచ్చి ఆరా తీశారు. ఇదే స్కూల్‌లో హెచ్‌ఎంగా పని చేసిన మహిళకు కూడా దివాకర్‌నాయుడు రూ. 10 లక్షల దాకా బాకీ పెట్టాడు. ఓ ప్రైవేట్ బ్యాంకులో ఏజెంటుగా పని చేస్తున్న వ్యక్తి ద్వారా రుణాలు పొంది, ఆయనతోనూ చీటీ వేయించుకున్నాడు. ఆయనకు రూ. 5 లక్షలు అప్పు పెట్టాడు. మరో కో ఆపరేటివ్ ఉద్యోగికి రూ. 10 లక్షలు బాకీ ఉన్నాడు. దీంతో కొందరు కలెక్టరేట్‌కు వెళ్లారు. ఇంకొందరు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. ఒక ప్రభుత్వ టీచరుగా ఉంటూ తోటి ఉద్యోగులు, ప్రైవేట్ వ్యాపారులు, రిటైర్డ్ ఉద్యోగుల్ని మోసగించడాన్ని బాధితులు జీర్ణించుకోలేకపోతున్నారు. కలెక్టర్, ఎస్పీ చొరవ తీసుకుని న్యాయం చేయాలంటూ వేడుకుంటున్నారు.

క్లుప్తంగా

అభివృద్ధి దిశగా పయనం

- మంత్రి సవిత



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి సవిత

అనంతపురం టవర్‌క్లాక్: నూతన ప్రభుత్వంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనం సాగిస్తోందని మంత్రి సవిత అన్నారు. బుధవారం అనంతపురంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీ అంబిక లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యేలు ఎంఎస్ రాజు, బండారు శ్రావణితో కలసి ఆమె మాట్లాడారు. గతంలో ఇసుక తీసుకోవాలంటే చాలా ఇబ్బంది ఉండేదన్నారు. ప్రస్తుతం ఇసుక కేవలం రూ.275కే అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. రైతాంగానికి గిట్టుబాటు ధర కల్పిస్తామన్నారు. అనంతపురాన్ని స్మార్ట్ సిటీగా గుర్తించి మరింత అభివృద్ధి చేస్తామని ఎంపీ అన్నారు. జిల్లాను హార్టికల్చర్ హబ్‌గా మార్చేందుకు కృషి చేస్తానన్నారు. పార్లమెంట్ సమావేశాల్లో జిల్లా సమస్యలపై మాట్లాడి, వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

కుటుంబ సంక్షేమమే దేశ సౌభాగ్యం



పోస్టర్లను విడుదల చేస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబదేవి, తదితరులు

అనంతపురం మెడికల్: కుటుంబ సంక్షేమమే దేశ సౌభాగ్యమని డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబదేవి అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రపంచ జనాభా దినోత్సవం ప్రాముఖ్యతను వివరించారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా గురువారం ఉదయం 8 గంటలకు అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాల నుంచి సప్తగిరి సర్కిల్ వరకూ ర్యాలీ ఉంటుందన్నారు. జనాభా నియంత్రణలో భాగంగా ఆశ కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీ, సంబంధిత వైద్యాధికారి ఇంటింటికీ తిరిగి ప్రజలకు అవగాహన కల్పిస్తారన్నారు. సమావేశంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సుజాత, స్టాటిస్టికల్ అధికారి షఫీ, డెమో సిబ్బంది త్యాగరాజు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

రంగంలో చార్ దిన్‌కా సుల్తాన్!

- నాలుగు రోజుల కోసం కక్కలపల్లి కాలనీ పంచాయతీ కార్యదర్శిగా ఆలమూరు కార్యదర్శికి ఎఫ్ఏసీ బాధ్యతలు
- అక్రమ లే ఔట్ ఆమోదానికి కుట్ర
- టీడీపీ నేతల ఒత్తిళ్లతో నిబంధనలను గాలికొదిలేసిన ఎంపీడీఓ
- రూ.కోట్లలో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతున్నా పట్టించుకోని అధికారులు



అనధికారిక లేఔట్ అంటూ పంచాయతీ అధికారులు వేసిన ఫ్లెక్సీ

రాప్తాడు రూరల్: అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లికాలనీ పంచాయతీ పరిధిలోని కళ్యాణదుర్గం రోడ్డులో ఉన్న బాలాజీ విల్లాస్, జయలక్ష్మీ విల్లాస్ పక్కన సర్వే నంబర్ 14–2లో 6.80 ఎకరాల భూమిలో ఏర్పాటు చేసిన అనధికారిక లేఔట్ ఆమోదం కోసం ఆలమూరు పంచాయతీ కార్యదర్శికి ఎఫ్ఏసీ బాధ్యతలు ఇవ్వడం చర్చనీయాంశమైంది. ప్రస్తుతం ఉన్న పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనారాయణ ఈ నెల 9 నుంచి 12 వరకు అంటే నాలుగు రోజులు సెలవు పెట్టారు. ఆయన సెలవు పెట్టిన రోజే మరో పంచాయతీ కార్యదర్శికి ఎఫ్ఏసీ బాధ్యతలు అప్పగించడం వెనుక ఆంతర్యం ఏమిటో ఎంపీడీఓకే తెలియాలి. సాధారణంగా 15 రోజుల కంటే తక్కువ రోజులు ఎవరైనా సెలవు పెడితే మరో ఉద్యోగికి ఇన్‌చార్జ్ ఇవ్వొచ్చని పలువురు ఉద్యోగులు చెబుతున్నారు. అంతకు మించి సెలవు పెడితేనే ఎఫ్ఏసీ బాధ్యతలు ఇవ్వాలని అంటున్నారు. మరి కక్కలపల్లి కాలనీ పంచాయతీ కార్యదర్శి కేవలం నాలుగు రోజులు మాత్రమే సెలవు పెట్టారు. మరి ఆయన స్థానంలో ఆలమూరు పంచాయతీ కార్యదర్శి సర్దార్‌వలికి ఎఫ్ఏసీ బాధ్యతలు అప్పగించడం వెనుక పరమార్థం ఎంపీడీఓకే తెలియాలి. సెలవుపై వెళ్లిన లక్ష్మీనారాయణ మన్నీల పంచాయతీ కార్యదర్శిగానూ పని చేస్తున్నా రు. మరి అక్కడ మాత్రం ఎవరినీ నియమించలేదు. అనధికార లేఔట్‌ను ఆమోదించే క్రమంలో ఎంపీడీఓ, అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారనే ప్రచారం సాగుతోంది. పంచాయతీ, అహుడాకు రావాల్సిన దాదాపు రూ. 8 కోట్ల ఆదాయానికి అధికార పార్టీ నేతల ఒత్తిళ్లతో గండి పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. దీని వెనుక కొందరు అధికార పార్టీ నాయకులకు, పంచాయతీ, రిజిస్ట్రేషన్ అధికారులకు భారీగా లబ్ధి చేకూరుతున్నట్లు తెలిసింది.

రిజిస్ట్రేషన్లకు సిద్ధం..

పంచాయతీ, అహుడా అనుమతులు లేకపోయినా, ప్రభుత్వానికి ఫీజులు చెల్లించకపోయినా అధికార పార్టీ నేతలను ప్రసన్నం చేసుకుంటే చాలు ఎంచక్కా రిజిస్ట్రేషన్లు జరిగిపోతున్నాయి. ఇందుకు సర్వే నంబర్ 14–2లోని అనధికార లేఔట్‌నే నిదర్శనం. ఈ లేఔట్‌కు ఎలాంటి అనుమతులు లేవని స్వయంగా పంచాయతీ కార్యదర్శి... కలెక్టర్, అహుడా వైస్ చైర్మన్, సబ్ రిజిస్ట్రార్, పంచాయతీరాజ్ కమిషనర్, జిల్లా పంచాయతీ అధికారి, డివిజనల్ పంచాయతీ అధికారికి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. కానీ, ఇప్పటి వరకూ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విశేషం. ఈ లేఔట్‌లోని ప్లాట్ల రిజిస్ట్రేషన్‌కు రంగం సిద్ధం చేశారు. నేడో, రేపో రిజిస్ట్రేషన్లు చేయనున్నట్లు తెలిసింది. కాగా, రిజిస్ట్రేషన్లు కాగానే వెంటనే పంచాయతీ కార్యాలయం నుంచి అప్రూవల్స్ తీసుకోనున్నారు. ఇందు కోసమే తమకు అనుకూలమైన పంచాయతీ కార్యదర్శిని ఎఫ్ఏసీగా నియమించుకున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది.

‘ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీగా వెంకటనాయుడికి అవకాశమివ్వండి’

అనంతపురం: ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీగా రెక్టార్ జి.వెంకటనాయుడుకు అవకాశం కల్పించాలని వర్సిటీ యాజమాన్యం కోరింది. ఈ మేరకు ఉన్నత విద్య ప్రిన్సిపల్ సెక్రెటరీకి మెయిల్ పంపినట్లు సమాచారం. కూటమి ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎస్కేయూ వీసీ డాక్టర్ కె.హుస్సేన్‌రెడ్డి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. దీంతో ఇన్‌ఛార్జి వీసీ నియామకం అనివార్యమైంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండు వారాల్లోనే రెక్టార్‌గా ప్రొఫెసర్ వెంకటనాయుడు (ఎకనామిక్స్)కు అవకాశం కల్పించారు. వాస్తవానికి సీనియర్ మోస్ట్ ప్రొఫెసర్‌ను రెక్టార్‌గా నియామకం చేయాలి. కానీ సీనియార్టీలో 16వ స్థానంలో ఉన్న వెంకటనాయుడుకు ఆ అవకాశం దక్కింది. తాజాగా ఇన్‌చార్జ్ వీసీ కావాలని ప్రయత్నాలు ముమ్మరం చేశారు. వాస్తవానికి ఇన్‌చార్జ్ వీసీ ప్యానల్‌లో ప్రొఫెసర్ పుష్పాంజలి(స్టాటిస్టిక్స్), ప్రొఫెసర్ అనిత (ఎంబీఏ), ప్రొఫెసర్ పి.మురళీకృష్ణ (ఎంబీఏ) పేర్లు ఉన్నాయి. వెంకటనాయుడు మృదుస్వభావి. వివాద రహితుడు. ఎలాంటి అవినీతి మరక లేని వ్యక్తి అని వర్సిటీ రిజిస్ట్రార్ సమాచారం పంపారు. మాజీ ఐఏఎస్ అధికారి కె.లక్ష్మీనారాయణకు వెంకటనాయుడు సమీప బంధువు కావడంతో ఇతనికి ఇన్‌చార్జ్ వీసీగా అవకాశం కల్పిస్తే వర్సిటీ అభివృద్ధికి ఎలాంటి ఢోకా ఉండదని మెయిల్‌లో పేర్కొన్నట్లు తెలిసింది. వాస్తవానికి వర్సిటీ అధికారికంగా మెయిల్ చేస్తే ఉన్నత విద్య ప్రిన్సిపల్ సెక్రెటరీ ఆమోదించే అవకాశాలు అధికంగా ఉంటాయని విద్యావేత్తలు పేర్కొంటున్నారు. ఏదీ ఏమైనా వర్సిటీ యాజమాన్యం అధికారికంగా కోరడం చర్చనీయాంశమైంది.

తొలగించే అధికారం మీకెక్కడిది?

- స్కీమ్ వర్కర్లు, కార్మికులపై వేధింపులు మానుకోవాలి
- కార్పొరేట్లకు మోదీ ప్రభుత్వం తొత్తుగా మారింది
- లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి
- డిమాండ్లు పరిష్కరించకుంటే ఉద్యమం ఉధృతం
- ధర్నాలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు



ధర్నాలో ప్రసంగిస్తున్న ఓబులు

అనంతపురం అర్బన్: ‘అంగన్‌వాడీ, ఆశ వంటి స్కీమ్ వర్కర్లు, కార్మికులపై గ్రామాల్లో స్థానిక అధికార పార్టీ నాయకుల వేధింపులు తారాస్థాయికి చేరుకున్నాయి. 20 ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికులను తొలగించే అధికారం మీకెక్కడిది?’ అంటూ సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబులు ధ్వజమెత్తారు. తొలగింపులకు పాల్పడం దుర్మార్గమని పేర్కొన్నారు. బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో డిమాండ్స్–డే నిర్వహించారు. అనంతపురంలోని లలితకళాపరిషత్ నుంచి సీఐటీయూ అనుబంధ సంఘాల నాయకులు, కార్మికులు ర్యాలీగా కలెక్టరేట్ చేరుకుని ధర్నా చేపట్టారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు నాగమణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఓబులుతో పాటు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ పాల్గొని, మాట్లాడారు. కేంద్రంలో కార్మిక వ్యతిరేక పాలన సాగుతోందని మండిపడ్డారు. కార్పొరేట్లకు మోదీ ప్రభుత్వం తొత్తుగా మారిందన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లావ్యాప్తంగా గ్రామాల్లో స్కీమ్ వర్కర్లు, కార్మికులపై అధికార పార్టీ స్థానిక నాయకులు బెదిరింపులకు పాల్పడుతుండడం సిగ్గుచేటన్నారు. కొన్ని చోట్ల స్కీమ్ వర్కర్లతో బలవంతంగా రాజీనామా చేయిస్తున్నారని, కొన్ని చోట్ల పని చేయనీయకుండా అడ్డుకుంటున్నారని మండిపడ్డారు.కార్మికులు పోరాడి సాధించుకున్న 39 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్లుగా సవరించడం దుర్మార్గపు చర్యగా అభివర్ణించారు. కార్పొరేట్‌లకు తొత్తుగా మారిన మోదీ ప్రభుత్వం పెట్టుబడిదారుల కోసం పనిచేస్తూ కార్మికులకు అన్యాయం చేస్తోందన్నారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వాలు పరిష్కరించకుంటూ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం సమస్యల పరిష్కారం కోరుతూ డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గోపాల్, వెంకటనారాయణ, రమాదేవి, నక్షత్ర, ముర్తుజా, తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ డిమాండ్లు...

- స్కీమ్ వర్కర్లపై రాజకీయ వేధింపులు మానుకోవాలి. అక్రమ తొలగింపులు ఆపాలి
- లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలి.
- అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్నభోజన పథకం, నేషనల్ హెల్త్ మిషన్, తదితర పథకాలలో పని చేస్తున్న వారిని కార్మికులుగా గుర్తించి కనీస వేతనం ఇవ్వాలి.
- అసంఘటిత కార్మికులందరికీ సమగ్ర చట్టం చేయాలి. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి.
- భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అందించాలి.
- పౌర సరఫరాల సంస్థ, ఐఎంఎల్ డిపోల్లో పని చేస్తే హమాలీలకు కూలి ధర పెంచాలి.
- శ్రీరాంరెడ్డి, సత్యసాయి నీటి ప్రాజెక్టుల కార్మికులకు పెండింగ్ వేతనాలు, పీఎఫ్ బకాయిలు చెల్లించాలి.
- అధిక పెనాలిటీలు వేసే జీఓ 21ని రద్దు చేయాలి.
- మునిసిపల్, పంచాయతీ, స్వచ్ఛభారత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి.

శిశుగృహలో కలెక్టర్ తనిఖీలు



చిన్నారుల ఆరోగ్య వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం సెంట్రల్: జిల్లా కేంద్రంలోని బుడ్డప్పనగర్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిశు గృహను కలెక్టర్ వినోద్ కుమార్ బుధవారం సాయంత్రం ఆకస్మిక తనిఖీ చేశారు. హరిత అనంత కార్యక్రమంలో భాగంగా శిశుగృహ ఆవరణలో మొక్కలు నాటారు. మొక్కలు పెంపకం ఆవశ్యకతను చిన్నారులకు వివరించారు. అనంతరం శిశుగృహను పరిశీలించారు. ఆశ్రయం పొందుతున్న చిన్నారులకు రెగ్యులర్‌గా వైద్య పరీక్షలు చేయించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంట ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ పీడీ శ్రీదేవి, నోడల్ ఆఫీసర్ వనజాక్షి, శిశుగృహ, బాలసదనం అధికారులు పాల్గొన్నారు.

నీటి సంపులో పడి వ్యక్తి మృతి

కళ్యాణదుర్గం: స్థానిక గరీబ్ నగర్‌కు చెందిన మస్తాన్‌వలి (32) నీటి సంపులో పడి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.... బుధవారం రాత్రి భోజనం ముగించుకున్న అనంతరం మస్తాన్‌వలి నిద్రకు ఉపక్రమించాడు. అర్ధరాత్రి మూత్ర విసర్జనకు ఇంటి ఆవరణలోకి వెళ్లిన అప్పటికే మూత తెరిచి ఉన్న నీటి సంపును గమనించకుండా అందులో పడి నీట మునిగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆయనను వెలికి తీసేలోపు అపస్మారక స్థితికి చేరుకున్నాడు. దీంతో వెంటనే స్థానిక సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మస్తాన్‌వలి మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై కళ్యాణదుర్గం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

భార్యను కొట్టి చంపిన భర్త



మృతి చెందిన సువర్ణ

గార్లదిన్నె: కట్టుకున్న ఇల్లాలిని వివాహేతర సంబంధం మోజులో భర్త కొట్టి హతమార్చాడు. పోలీసులు తెలిపిన మేరకు... నంద్యాల జిల్లా ప్యాపిలి గ్రామానికి చెందిన తలారి ఓబులేసు కుమార్తె సువర్ణ(26)కు పదేళ్ల క్రితం గార్లదిన్నె మండలం ఇల్లూరుకు చెందిన ఎర్రిస్వామితో వివాహమైంది. వీరికి ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. కొన్ని నెలలుగా భర్త మరో మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తుండడం తెలుసుకున్న సువర్ణ పలు మార్లు మందలించింది. అయినా ఆయన ప్రవర్తనలో మార్పు రాలేదు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి మరోసారి భర్తను భార్య హెచ్చరించింది. వివాహేతర సంబంధం మంచిది కాదని హితవు పలికింది. దీంతో తీవ్ర ఆవేశానికి లోనైన ఎర్రిస్వామి తన భార్యను విచక్షణారహితంగా చితకబాదాడు. దెబ్బలకు తాళలేక సువర్ణ మృతి చెందింది. అనంతరం ఆమె మృతదేహాన్ని ఉరికి వేలాడదీసి ఆత్మహత్య చేసుకున్నట్లుగా చిత్రీకరించి, గ్రామస్తులను నమ్మించాడు. విషయం తెలుసుకున్న సువర్ణ కుటుంబసభ్యులు బుధవారం ఉదయం ఇల్లూరుకు చేరుకుని కుమార్తె మృతదేహాన్ని పరిశీలించి, బోరున విలపించారు. ఆమెది ఆత్మహత్య కాదని, భర్తే కొట్టి హతమార్చాడంటూ ఇంటి వద్ద ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న సీఐ శ్రీధర్, ఎస్ఐ మహమ్మద్ గౌస్ అక్కడకు చేరుకుని పరిశీలించారు. బంధువులకు సర్ది చెప్పి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఎర్రిస్వామిపై హత్య కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

ప్రమాదాల నివారణపై అవగాహన తప్పనిసరి

అనంతపురం క్రైం: ప్రమాదాలు జరగకుండా ప్రతి ఒక్కరూ కనీస జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జి.శివప్రసాద్‌యాదవ్, ట్రాఫిక్ సీఐ నారాయణరెడ్డి అన్నారు. ప్రమాదాల నివారణపై బుధవారం అనంతపురంలోని ఆర్టీసీ డిపోలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు వారు ముఖ్య అతిథులుగా హాజరై, మాట్లాడారు. ప్రమాదాల నియంత్రణపై అవగాహన పెంచే ఇలాంటి కార్యక్రమాల్లో ప్రజలనూ భాగస్వాములను చేస్తే బాగుంటుందన్నారు. రోడ్డుపై ప్రయాణించే సమయాల్లో మనమెంత జాగ్రత్తగా వాహనం నడుపుతున్నామో...ఎదురుగా వస్తున్న వాహనదారుడిపై కూడా దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. అలాంటప్పుడే ప్రమాద రహిత జిల్లాగా అనంతకు గుర్తింపు వస్తుందన్నారు.

యువకుడి బలవన్మరణం



మృతుడు నాగయ్య

తాడిపత్రి రూరల్: పెళ్లి కాలేదన్న బెంగతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు... తాడిపత్రిలోని పాతకోటకు చెందిన లక్ష్మీదేవి, ఆదెన్న దంపతుల కుమారుడు నాగయ్య (22) స్థానిక ఓ వాటర్ ప్లాంట్‌లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. నాగయ్యకు పెళ్లి చేయాలని తల్లిదండ్రులు పలు సంబంధాలు చూశారు. అయితే మెల్ల కన్ను ఉండడంతో పెళ్లి సంబంధాలు కుదరలేదు. దీంతో ఇక తనకు వివాహం కాదని, బతికున్నంత కాలం ఒంటరిగానే జీవించాల్సి ఉంటుందని భావించిన నాగయ్య, జీవితంపై విరక్తితో బుధవారం ఉదయం పుట్లూరు రైల్వే గేటు వద్దకు చేరుకుని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

‘మిడ్‌పెన్నార్’లో చేప పిల్లల పెంపకం ప్రారంభం



తల్లిచేపలకు ఇంజెక్షన్లు వేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఫిషరీస్ డీడీ నాయక్, ఎఫ్‌డీఓలు ఆసీఫ్, ఫక్కీరయ్య

అనంతపురం అగ్రికల్చర్: జిల్లాలో చేపపిల్లల పెంపకాన్ని జిల్లా మత్స్యశాఖ మొదలు పెట్టింది. ఈ ఏడాది 8 కోట్ల చేపపిల్లలు ఉత్పత్తి లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఇందులో భాగంగా గార్లదిన్నె మండల పరిధిలో ఉన్న మిడ్‌పెన్నార్ రిజర్వాయర్ (ఎంపీఆర్) లోని మత్స్య క్షేత్రంలో 5 కోట్లు, అనంతపురంలో ఉన్న మత్స్యక్షేత్రంలో 3 కోట్లు ఉత్పత్తి చేయాలనుకున్నారు. కట్ల, రాహు, మృగాల, బంగారు తీగ రకాలకు చెందిన తల్లి చేపలకు ఇంజెక్షన్లు ఇచ్చి గుడ్లు పొదిగించే కార్యక్రమం ప్రస్తుతానికి ఎంపీఆర్‌లో మొదలు పెట్టారు. వర్షాలు లేక హెచ్చెల్సీకి నీళ్లు రాకపోవడం, అలాగే భూగర్భజలాలు అడుగంటిపోవడంతో ఉన్న బోరుబావి నుంచి నీళ్లు రాని కారణంగా అనంతపురం మత్స్యక్షేత్రంలో కార్యక్రమం ప్రారంభించని పరిస్థితి నెలకొంది. దీంతో ఇక్కడ 3 కోట్ల చేపపిల్లల ఉత్పత్తి ప్రస్తుతానికి నిలిచిపోయింది. గత ఐదేళ్లుగా సకాలంలో మంచి వర్షాలు పడడంతో చేప పిల్లల ఉత్పత్తి, పెంపకానికి ఆటంకం లేకుండా నడిచిపోయింది. కాగా, అనంతపురం, ఎంపీఆర్ క్షేత్రాల్లో చేప గుడ్లు పొదిగించి స్పాన్ రూపంలో ఉత్పత్తి అయిన చేపపిల్లలను అనంతపురం, ఎంపీఆర్‌తో పాటు పీఏబీఆర్, బీటీ ప్రాజెక్టు పరిధిలో ఉన్న మత్స్యక్షేత్రాల్లో మూడు నెలల వరకూ పెంపకం చేస్తారు. మూడు నెలల వయస్సున్న ఫింగర్‌లింగ్స్‌ను లైసెన్సు కలిగిన పేరూరులోని అప్పర్ పెన్నార్ ప్రాజెక్టు, పెనకచెర్లలో ఉన్న మిడ్‌పెన్నార్ ప్రాజెక్టు, బీటీ ప్రాజెక్టుల్లోకి ఉచితంగా వదలనున్నారు. లీజు పద్ధతిలో పీఏబీఆర్, ఇతర మత్స్యకార సొసైటీ పరిధిలో ఉన్న మరికొన్ని చెరువులకు ఇస్తారు. మరికొన్ని చెరువులకు రాయితీతో చేపపిల్లల పంపిణీ చేయనున్నారు. అయితే వర్షాభావంతో ఈ సారి ప్రతికూల పరిస్థితులు ఉన్నందున అనుకున్న సమయానికి ఉత్పత్తి ఆశించిన స్థాయిలో జరిగే పరిస్థితి లేదని చెబుతున్నారు.

నీళ్లున్న ప్రతి చెరువుకూ ఉచితంగా చేపపిల్లలు ఇవ్వండి

- జాతీయ మత్స్యకార దినోత్సవంలో సొసైటీ సభ్యుల విన్నపం



మత్స్యకార దినోత్సవంలో పాల్గొన్న ఫిషరీస్ అధికారులు, మత్స్యకార సొసైటీ అధ్యక్షులు, సభ్యులు

అనంతపురం అగ్రికల్చర్: మత్స్యకార సొసైటీ పరిధిలో నీళ్లున్న ప్రతి చెరువుకూ ఉచితంగా చేపపిల్లలు అందించాలని సొసైటీలకు చెందిన పలువురు సభ్యులు విజ్ఞప్తి చేశారు. స్థానిక ఫిషరీస్ డీడీ కార్యాలయంలో జాతీయ మత్స్యకార దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. డీడీ శ్రీనివాసనాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సొసైటీ జిల్లా అధ్యక్షుడు నగేష్, మాజీ అధ్యక్షుడు అంకె పోతన్న, ఎఫ్‌డీఓలు హెచ్ ఎస్ ఆసీఫ్, డి.ఫక్కీరయ్య, ఎస్ఎస్ లక్ష్మీనారాయణతో పాటు పలువురు సొసైటీ సభ్యులు పాల్గొన్నారు. జాతీయ మత్స్యకార దినోత్సవం విశిష్టత, వర్గాల అభివృద్ధి తదితర అంశాలను డీడీ నాయక్ వివరించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు మాట్లాడుతూ... చేపల పెంపకం, వేటపై ఆధారపడి జీవనం సాగిస్తున్న సొసైటీలు, పేద వర్గాలకు ప్రభుత్వం, మత్స్యశాఖ ద్వారా పెద్ద ఎత్తున ప్రోత్సాహం అందిస్తే ఆర్థికంగా ముందడుగు వేస్తారన్నారు. చెరువులు నింపడం, నిండిన చెరువులకు ఉచితంగా చేపపిల్లలు అందించడం, గతంలో మాదిరిగా ఎస్సీ ఎస్టీ వర్గాలకు 95 శాతం, మిగతా వారికి 75 శాతం రాయితీతో వలలు, బోట్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

ప్రత్యేక సెమెన్ ఇంజెక్షన్‌తో పెయ్య దూడల జననం

- డీఎల్‌డీఏ ఈఓ డాక్టర్ టీవీ సుధాకర్



మాట్లాడుతున్న డాక్టర్ టీవీ సుధాకర్

పామిడి: పాడి అభివృద్ధిలో భాగంగా పశువులకు ప్రత్యేక సెమెన్ ఇంజెక్షన్ ఇవ్వడం ద్వారా కేవలం పెయ్య దూడలే పుడతాయని పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకులు, డీఎల్‌డీఏ ఈఓ డాక్టర్ టీవీ సుధాకర్ అన్నారు. పామిడి మండలం రామగిరిలో బుధవారం ఏర్పాటు చేసిన పశువుల ఉచిత గర్భకోశ చికిత్స శిబిరాన్ని ఆయన ప్రారంభించి, మాట్లాడారు. దూడలు, పాడిపశువుల్లో క్రమం తప్పకుండా నట్టల నివారణ మందులు వాడాలన్నారు. వెంటనే కాకుండా కొంత ఎద ఆరిన తర్వాత కృత్రిమ గర్భధారణ ఇంజెక్షన్‌తో కట్టు శాతం పెంపొందుతుందన్నారు. ఇళ్లు, పొలాల చుట్టూ లభ్యమయ్యే సుబాబుల్, చిగురాకును పశువులకు ఆహారంగా వేయడం ద్వారా కలిగే లాభాలను వివరించారు. లింగ నిర్ధారిత వీర్యం వాడకం వల్ల 90 శాతం ఆడదూడలే జన్మిస్తాయన్నారు. ఈ ఇంజెక్షన్ ఖరీదు రూ.1,350 కాగా, ప్రభుత్వ సబ్సిడీ రూ.850 పోనూ రైతు వాటా కింద రూ.500లు మాత్రమే చెల్లించాల్సి ఉంటుందన్నారు. రెండు ఎద సూదులు వేసినప్పటికీ పశువు కట్టు నిలబడకపోతే రూ.500, మగ దూడ పుడితే రూ.250 వెనక్కు చెల్లిస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పాడిరైతులకు పిలుపునిచ్చారు. అనంతరం 38 పాడిపశువులకు గర్భకోశ పరీక్షలు నిర్వహించి, మందులు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ఎద్దులపల్లి పశువైద్యాధికారి బి.సాయిసుప్రజ, డాక్టర్ ఉషాకిరణ్, ఏహెచ్‌ఏ, గోపాలమిత్రలు, పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మంత్రిని కలిసిన కలెక్టర్



మంత్రి సవితకు మొక్క అందజేస్తున్న కలెక్టర్ వినోద్ కుమార్

అనంతపురం టవర్‌క్లాక్: బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితను జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ బుధవారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మొక్కను అందజేసిన అనంతరం జిల్లాలో నెలకొన్న సమస్యలపై చర్చించారు.

ఓసీ నిరుద్యోగులను ఆదుకోవాలి

అనంతపురం ఎడ్యుకేషన్: ఓసీ నిరుద్యోగులను ఆదుకోవాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితను ఓసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి బుర్రా జయవర్ధన్ రెడ్డి కోరారు. బుధవారం స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. బీసీ స్టడీ సర్కిల్ ద్వారా అన్ని వర్గాలకు ఉచితంగా డీఎస్సీ కోచింగ్ ఇస్తున్నప్పటికీ.. ఓసీ కులాలను మాత్రమే విస్మరించడం బాధాకరమన్నారు. ఓసీల్లోనూ చాలామంది నిరుపేదలు ఉన్నారని గుర్తు చేశారు. రాజ్యాంగబద్ధంగా ఓసీలకు అందాల్సిన ఈడబ్ల్యూఎస్ 10 శాతం కోటా పక్కాగా అమలు చేసేలా చూడాలని కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించి డీఎస్సీకి ప్రిపేరయ్యే ప్రతి ఓసీ అభ్యర్థికి ఉచితంగా కోచింగ్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పీర్ల పెట్టె ఊరేగింపు

ఆత్మకూరు: మొహర్రం ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి ఆత్మకూరులో పీర్ల పెట్టెను భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. స్థానిక మసీదు నుంచి పీర్లను ఒక పెట్టెలో పెట్టుకుని మేళతాళాలతో మెరవణి చేశారు. డప్పుచప్పుళ్ల మధ్య పీర్లను తీసుకెళ్లి చదివింపులు చేయించారు. అనంతరం పీర్లను తీసుకువచ్చి పీర్ల మసీదులో కొలువుదీర్చారు.

జిల్లా జడ్జిని కలిసిన శ్రీసత్యసాయి కలెక్టర్



జిల్లా జడ్జి శ్రీనివాస్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

అనంతపురం: నగరంలోని జిల్లా కోర్టు ఆవరణలో ఉన్న జిల్లా జడ్జి చాంబర్‌లో జిల్లా జడ్జి జి.శ్రీనివాస్‌ను శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్‌గా ఉదయం బాధ్యతలు చేపట్టిన ఆయన జిల్లా జడ్జికి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీసత్యసాయి జిల్లా కేంద్రంలో కోర్టు భవనాల నిర్మాణాలకు అవసరమైన భూసేకరణ కోసం సహకారాలు అందిస్తామని జడ్జికి హామీ ఇచ్చారు. రెవెన్యూ అంశాలతో కోర్టు కేసులను త్వరితగతిన పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

సర్వసభ్య సమావేశానికి తరలిరండి

అనంతపురం కల్చరల్: జిల్లా అర్చకుల సమస్యలు వినిపించేందుకు జిల్లా కేంద్రంలో జరిగే అర్చక సర్వసభ్య సమావేశానికి తరలి రావాలని సమాఖ్య అధ్యక్షుడు వైపీ ఆంజనేయులు అన్నారు. బుధవారం జిల్లా అర్చక సమాఖ్య సభ్యులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అనంతపురం, సత్యసాయి జిల్లా ఎండోమెంటు అధికారులను కలిసి ఈనెల 22న అనంతలోని మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వరాలయంలో జరిగే జిల్లా అర్చక సమావేశానికి రావాలని కోరినట్లు తెలిపారు. ప్రభుత్వాలతో సంబంధం లేకుండా అర్చక సమస్యల పరిష్కారానికి అందరూ సంఘటితంగా ఉండాలన్నారు. జిల్లా కేంద్రంలో జరిగే సమావేశంలో అర్చకులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అర్చక సమాఖ్య సభ్యులు నగేష్, ఆనంద్, రాజగోపాల్, మారుతీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో అనర్థాలు



మాట్లాడుతున్న సీఐ ఎల్లయ్య

రాప్తాడు: మాదకద్రవ్యాలతో విద్యార్థులు తమ జీవితాలను నాశనం చేసుకోవద్దు. మాదకద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని అనంతపురం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ సీఐ ఎల్లయ్య సూచించారు. బుధవారం మండలంలోని గొల్లపల్లి గ్రామ సమీపంలో మాంటిస్సోరి ఎలైట్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో మాదక ద్రవ్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాలు తీసుకోవడం వల్ల భవిష్యత్తు అంధకారంగా మారుతుందన్నారు. సమాజంలో నైతిక విలువలను కోల్పోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఎండీ కృష్ణ భరత్, డీన్ మధు, ఎస్ఐ సరస్వతి, హెడ్‌కానిస్టేబుల్ వెంకట నారాయణ పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి

- కేంద్రం, రాష్ట్రాల నుంచి నిధులు తీసుకురావాలి
- అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సాధించాలి
- మేయర్ వసీం, ఎంపీ అంబికా, ఎమ్మెల్యే దగ్గుపాటి సూచన
- నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశం



మాట్లాడుతున్న మేయర్ వసీం, చిత్రంలో ఎంపీ అంబికా, ఎమ్మెల్యే దగ్గుపాటి, సభ్యులు

అనంతపురం సెంట్రల్: రాజకీయాలకు అతీతంగా నగరాభివృద్ధికి కృషి చేద్దామని మేయర్ మహమ్మద్ వసీం పిలుపునిచ్చారు. బుధవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. తొలిసారిగా హాజరైన ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మేయర్ వసీం మాట్లాడుతూ.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలనలో రూ.1,045 కోట్లతో నగరాభివృద్ధి చేశామని వివరించారు. మురికివాడల అభివృద్ధికి కృషి చేశామని వెల్లడించారు. రానున్న రోజుల్లో కూడా రాజకీయాలను పక్కనపెట్టి నగరాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఎమ్మెల్యే, ఎంపీలకు ప్రస్తుత కౌన్సిల్ పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. రానున్న రోజుల్లో సీజనల్ వ్యాధులు, డయేరియా ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రూ.25 కోట్ల స్పెషల్‌గ్రాంట్ నిధులు తీసుకొచ్చామని.. పెండింగ్‌లో ఉన్న ఈ పనులను పూర్తి చేయాలన్నారు. నగరాన్ని స్మార్ట్ సిటీగా మార్చేందుకు అవసరైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పార్కుల అభివృద్ధి, నగరపాలక సంస్థలోకి నాలుగు పంచాయతీలను విలీనం చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్లాస్టిక్‌ను పూర్తిగా నిర్మూలించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వినాయక చవితి సందర్భంగా అందరూ మట్టి వినాయకులనే పూజించాలన్నారు. చర్చీలు, మసీదులు, దేవాలయాలకు పన్ను మినహాయింపు ఇవ్వాలని కోరారు. అనధికారిక హోర్డింగ్స్, ఆక్రమణలపై కొరడా ఝుళిపించాలని అధికారులను ఆదేశించారు. గత మూడేళ్లుగా నీతి నిజాయతీతో తమ కౌన్సిల్ పని చేస్తోందని.. ఏ అంశంపై అయినా విచారణ చేసి అక్రమాలు జరిగాయని రుజువు చేసిన తర్వాతే మాట్లాడాలని ఎంపీ, ఎమ్మెల్యేలకు సూచించారు. నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటుకు తమ హయాంలో కేంద్రానికి ప్రతిపాదనలు పంపామని గుర్తు చేశారు. డంపింగ్ యార్డును రూరల్ మండల పరిధిలోకి తరలించాలని భావించినప్పటికీ ప్రజలు అభ్యంతరం చెప్పడంతో ఆగిపోయిందని వివరించారు. డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ.. డంపింగ్ యార్డులో చెత్త తరలింపులో అవినీతి జరిగినట్లు తెలుస్తోంని.. దీనిపై సమగ్రంగా విచారించాలని డిమాండ్ చేశారు. 3.32 లక్షల టన్నులు తరలించినట్లు సదరు కాంట్రాక్టు సంస్థ ప్రకటించిందన్నారు. ఆ లెక్కన అక్కడ చెత్తే ఉండకూడదని తెలిపారు. ల్యాబ్ నివేదికలు తెప్పించుకుని అక్రమాలు జరిగినట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య మాట్లాడుతూ... పనిముట్లు, బ్లీచింగ్ పౌడర్, డంపింగ్ యార్డులో జరిగిన అక్రమాలపై విచారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వీటిపై కమిటీలు వేయాలని కోరారు. అలాగే గుత్తి రోడ్డు, బైపాస్‌లతో పాటు పలు ప్రధాన రోడ్లు వేశామని గుర్తు చేశారు. అయితే లైట్లు మాత్రం పడటం లేదని తెలిపారు. నగరాన్ని స్మార్ట్ సిటీగా మార్చేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ అన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్ని నెరవేరుస్తామని పేర్కొన్నారు. త్వరలో భూగర్భ డ్రైనేజీ తీసుకువస్తామన్నారు. అలాగే సభ్యులు ఆరోపించిన విధంగా ఎక్కడెక్కడ అక్రమాలు జరిగాయో వాటిపై విచారణ చేసి చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే పలు అంశాలపై కలెక్టర్‌కు లేఖ రాశాం. త్వరలో కమిటీని ఏర్పాటు చేసి అక్రమాలు నిగ్గు తేలుస్తామని తెలిపారు. నగరపాలక సంస్థ కార్యాలయంతో పాటు పలు చోట్ల సోలార్‌సిస్టం ఏర్పాటు చేసి విద్యుత్ ఆదా చేసేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. అలాగే చెత్త తరలించే ట్రాక్టర్ నిర్వహణ భారంగా మారుతోంది. ఇవి కాంట్రాక్టు సంస్థకు అప్పగించడంపై ఆలోచించాలన్నారు. నగరంలో ఎక్కడ చూసినా ఆక్రమణలకు గురయ్యాయి. రోడ్లు, కాలువలు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. నిబంధనలు ఉల్లంఘించి నిర్మించిన కట్టడాలను కూడా తొలగించాలన్నారు. నగరంలో ఇలాంటి వాటిని గుర్తించి నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. వర్షాకాలంలో ఇబ్బందులు రాకుండా ముందే చర్యలు తీసుకోవాలి. నగరానికి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ తీసుకొచ్చేందుకు కృషి చేస్తాం. నగరం స్మార్ట్ సిటీగా మార్చేందుకు చేపట్టాల్సిన పనులపై దృష్టి పెట్టి అభివృద్ధి చేస్తామన్నారు. ఎక్కడైతే అక్రమాలు జరిగినట్లు వార్తలు వస్తున్నాయో వాటన్నింటిపై విచారణ జరుగుతుందన్నారు. అలాగే రోడ్ల ఆక్రమణలకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు రాకుండా కొంతమంది సభ్యులతో కమిటీలు వేయాలన్నారు. రోడ్ల ఆక్రమణల వలన ఎలాంటి ఇబ్బందులు వస్తున్నాయో ప్రజలకు వివరించిన అనంతరం కూల్చివేసేందుకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ప్రజా సమస్యలపై సభ్యుల మండిపాటు

అనంతపురం సెంట్రల్: నగరంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించడం లేదని పలువురు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు అధికారులపై మండిపడ్డారు. ప్రతి సమావేశంలో చర్చించుకోవడం.. వెళ్లడం పరిపాటిగా మారుతోందని అసహనం వ్యక్తం చేశారు. ముఖ్యంగా డంపింగ్ యార్డులో బయోమైనింగ్ వ్యవహారంలో కాంట్రాక్టు సంస్థకు లబ్ధి చేకూరేలా అదనంగా బిల్లులు చేశారంటూ ఆరోపణలు రావడంపై సభ్యులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. గురువారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో అధికార పార్టీ కార్పొరేటర్లే ప్రజల సమస్యలపై, అధికారులు చేసిన తప్పిదాలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కార్పొరేటర్ లాలూ, అబుసలెహా మాట్లాడుతూ.. నగరంలో కుక్కల బెడద ఎక్కువవుతోందన్నారు. పాఠశాలలకు వెళ్లే చిన్నారులపై దాడి చేస్తున్నాయని వాపోయారు. కుక్కల తరలింపునకు అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తూ కార్పొరేటర్ అబుసలెహా బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. కార్పొరేటర్ శ్రీనివాసులు మాట్లాడుతూ.. 48 డివిజన్‌లో ఓ వ్యక్తి నడిమి వంకను ఆక్రమిస్తున్నాడంటూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. దీని వల్ల వర్షాకాలంలో 47, 48 డివిజన్‌లు మొత్తం మునిగిపోతాయని హెచ్చరించారు. కార్పొరేటర్ బాలాంజనేయులు మాట్లాడుతూ.. నగరంలో అనేక సంవత్సరాలుగా కుళాయి కనెక్షన్ లేకపోయినా, రెండేసి ఉన్నట్లు పన్నులు వేస్తున్నారన్నారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కోవిడ్, మలేరియా వర్కర్లను ఆప్కాస్‌లోకి కలిపి నెలనెలా జీతాలతో పాటు ఈఎఫ్, పీఎఫ్ అందించాలని కోరారు. రహదారి విస్తరణలో భాగంగా తొలగించిన జ్యోతిరావు పూలే, అబుల్ కలాం, వైఎస్సార్, రాజీవ్‌గాంధీ, ఇందిరాగాంధీ తదితర మహనీయుల విగ్రహాలను పునర్నిర్మించేలా చర్యలు తీసుకోవాలన్నారు. డంపింగ్‌యార్డులో అక్రమాలు జరిగినట్లు తేలితే సదరు కాంట్రాక్టు సంస్థపై చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ సైపుల్లా బేగ్ డిమాండ్ చేశారు. కార్పొరేటర్ బండి నాగమణి మాట్లాడుతూ.. ప్రతి సారి సెంట్రల్‌పార్కు కబ్జాకు గురైందని అంటున్నారు.. ఇంత వరకూ ఎలాంటి చర్యలు తీసుకున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. కో–ఆప్షన్ సభ్యుడు లక్ష్మిరెడ్డి మాట్లాడుతూ.. నగరంలో మరుగుదొడ్ల సమస్య తీవ్రంగా ఉందన్నారు. మహిళలకు ప్రత్యేకంగా నిర్మించాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలోనే నగరం అభివృద్ధి చెందినట్లు కార్పొరేటర్ సాకే చంద్రలేఖ తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా తమ డివిజన్‌లో రోడ్లు, కాలవలను అభివృద్ధి చేశామని వెల్లడించారు.

బడ్జెట్‌కు ఆమోదం

నగరపాలక సంస్థ బడ్జెట్‌ను సభ్యులు ఆమోదించారు. 2023–24 బడ్జెట్ రూ.107.64 కోట్లు కాగా.. ఈ ఆర్థిక సంవత్సరం (2024–25) రూ.125.85 కోట్లుగా అంచనా వేశారు. బడ్జెట్ అంచనాలను సభ్యులు ఆమోదించారు.

ఎమ్మెల్యే ప్రమాణం

నగరపాలకసంస్థ ఎక్స్ అఫిషియో సభ్యుడి హోదాలో ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ ప్రమాణం చేశారు. కమిషనర్ మేఘ స్వరూప్ ఎమ్మెల్యేతో ప్రమాణం చేయించారు. కాగా ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ప్రమాణ స్వీకారం చేయకపోవడం గమనార్హం.

నగరాభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ: మేఘ స్వరూప్, కమిషనర్

నగరాభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తున్నాం. ప్రజలకు అనుగుణంగా పబ్లిక్ టాయిలెట్స్ నిర్మాణాలు చేపడుతాం. 8 మరుగుదొడ్లు మంజూరయ్యాయి. వీటిని ఎక్కడెక్కడ నిర్మించాలో స్థల సేకరణ చేస్తున్నాం. నగరపాలక సంస్థలో మహిళా ఉద్యోగులు, ప్రజాప్రతినిధులకు ప్రత్యేకంగా టాయిలెట్స్ నిర్మిస్తాం. కుక్కల బెడదను తగ్గించేందుకు ఆపరేషన్లు చేస్తున్నాం. డంపింగ్ యార్డులో బయోమైనింగ్ వ్యవహారంపై త్వరలో కమిటీ వేస్తాం. అక్రమాలు జరిగినట్లు తేలితే సదరు కాంట్రాక్టు సంస్థను బ్లాక్ లిస్టులో పెడతాం. వీధి లైట్ల సమస్య ఎక్కడున్నా 24 గంటల్లో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలి.

బిల్లులు ఆపండి అంతే..



డంపింగ్ యార్డు సమస్యను డైలీ సీరియల్‌గా మార్చవద్దు. ఎంత వరకూ చెత్త తరలించి ఉంటే అంతవరకూ మాత్రమే బిల్లులు చేయాలి. ఇప్పటి వరకూ 40 శాతం మాత్రమే బిల్లులు చేశారని చెబుతున్నారు. విచారించిన అనంతరం మిగిలిన బిల్లులు చేయాలి. అధికారులు కూడా పద్ధతి మార్చుకోవాలి. లేదంటే భవిష్యత్‌లో ధర్నాలు చేస్తాం.

– సాకే చంద్ర, కార్పొరేటర్

అభివృద్ధి గురించి కూడా చర్చించాలి



ఎంతసేపు అవినీతి.. అవినీతి అంటున్నారు. ఎక్కడ అవినీతి జరిగిందో చెప్పాలి. కేవలం అవినీతి గురించే కాదు. గత ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి గురించి కూడా చర్చించాలి. వైఎస్సార్‌సీపీ హయాంలో గతంలో ఎప్పుడూ లేనంత అభివృద్ధి జరిగింది. ముఖ్యంగా రోడ్లు, కాలువలు నిర్మించాం. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గమనించాలి.

– మల్లిమీద నరసింహులు, కార్పొరేటర్

సేవకులు దేవుడి మాటలు వినాలి



కేక్ కట్ చేస్తున్న పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

రాప్తాడురూరల్: ప్రతి దైవ సేవకుడు దేవుని మాటలు వింటూ.. సున్నితమైన హృదయం కలిగి ఉండాలని పాస్టర్ థామస్ గువ్వల అన్నారు. బుధవారం అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి ఏసుకృపా మందిరంలో జిల్లా పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ 4వ వార్షికోత్సవ వేడుకలు అసోసియేషన్ అధ్యక్షుడు పాస్టర్ రెడ్డివారి నెహెమ్యా నాగరాజు అధ్యక్షతన జరిగాయి. తొలుత దైవ సేవకులు పాటలు పాడి దేవుడి నామాన్ని ఘనపరిచారు. పాస్టర్ అనిల్ ఎఫ్రాయిం ఆరాధన చేశారు. పాస్టర్ ఏసన్న తాడిపత్రి ఏసుక్రీస్తు ప్రార్థన మందిర నిర్మాణానికి రూ.15 వేలు, జేమ్స్ పాల్ నాయక్ కళ్యాణదుర్గం సతీమణి వైద్య నిమిత్తం రూ.8,900 ముఖ్య అతిథి చేతుల మీదుగా చెక్కులు అందజేశారు. అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ పాస్టర్ మార్క్, సెక్రటరీ పాస్టర్ జి.ఆర్.ఆనంద్, జాయింట్ సెక్రెటరీ పాస్టర్ వి.మనషే, ట్రెజరర్ పాస్టర్ జీవన్ బాబు, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ పాస్టర్ రూఫస్ కుమార్, పాస్టర్ కాంత వర్ధన్, పాస్టర్ జహంగీర్ జాషువా, పాస్టర్ లాబాను సుధాకర్, గౌరవ సలహాదారులు వైపీ బాబు, బిషప్, వాసు, అనిల్ కాంత్, పాస్టర్ ప్రకాష్, పాస్టర్ వీరేష్ పాల్గొన్నారు.

12న 'పూల్ క్యాంపస్ డ్రైవ్'

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక ఎస్వీ డిగ్రీ, పీజీ కళాశాలలో ఈనెల 12న పీపుల్ టెక్ గ్రూప్ కంపెనీ ఆధ్వర్యంలో 'పూల్ క్యాంపస్ డ్రైవ్' నిర్వహిస్తున్నట్లు విద్యా సంస్థల వైస్ చైర్మన్ సి.చక్రధర రెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 2023, 2024 సంవత్సరంలో బీబీఏ, బీసీఏ, బీకామ్, బీటెక్, బ్యాచిలర్ డిగ్రీ ఏదైనా ఉత్తీర్ణులైన వారు అర్హులని పేర్కొన్నారు. బయోడేటాతో ఉదయం 8:30 గంటలకు కళాశాల వద్దకు చేరుకోవాలన్నారు. ఇందులో మొదటి రౌండ్ గ్రూప్ డిస్కషన్ ఆధారంగా, రెండో రౌండ్ వ్యక్తిగత ఇంటర్వ్యూ ఆధారంగా ఎన్నిక ప్రక్రియ జరుగుతుందన్నారు. ఎంపికైన విద్యార్థులు కర్నూలు జిల్లా ఆదోని ప్రాంతంలో ఉద్యోగాలు చేయాల్సి ఉంటుందన్నారు. ఎంపికైన వారికి జీతంతో పాటు వసతి, భోజన సదుపాయం కూడా కల్పిస్తారని వెల్లడించారు.

బోధనలో నాణ్యత పెంచాలి



మాట్లాడుతున్న డిప్యూటీ డీఈఓ శ్రీనివాసరావు

అనంతపురం ఎడ్యుకేషన్: బోధనలో నాణ్యతను పెంచాలని డిప్యూటీ డీఈఓలు శ్రీనివాసరావు, నాగరాజు సూచించారు. తరగతి గది బోధనలో సామర్థ్యాలు పెంపొందించేందుకు, పిల్లలకు అత్యుత్తమ బోధన అందించడానికి సహాయపడే ×టీచ్ టూల్×పై తొమ్మిది రోజుల పాటు అనంతపురం, కళ్యాణదుర్గం, గుత్తి కేంద్రాల్లో ఎంపిక చేసిన టీచర్లకు శిక్షణ ఇచ్చారు. చివరి రోజు బుధవారం శిక్షణ కార్యక్రమం ముగింపు సందర్భంగా అనంతపురం, గుత్తి డివిజన్‌ల జిల్లా ఉప విద్యాధికారులు శ్రీనివాసులు, నాగరాజు మాట్లాడారు. తొమ్మిది రోజుల్లో నేర్చుకున్న అంశాలను పాఠశాలల్లో అమలు పరచి పిల్లలకు అత్యుత్తమ బోధన అందించాలని సూచించారు. తరగతి గదిలో ఉపాధ్యాయుడు పాఠాన్ని బోధిస్తున్నప్పుడు 28 అంశాలను దృష్టిలో ఉంచుకోవాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 592 మందికి శిక్షణ ఇచ్చారు. వీరికి శిక్షణ ఇవ్వడానికి 33 మంది మాస్టర్ ట్రైనర్స్ రాష్ట్ర స్థాయిలో శిక్షణ పొందారు. తొమ్మిది రోజుల పాటు శిక్షణ పొందిన ప్రతి ఉపాధ్యాయుడు 15 మంది ఉపాధ్యాయులను తరగతి గదిలో అబ్జర్వ్ చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష ఏఎంఓ చంద్రశేఖర్ రెడ్డి, అసిస్టెంట్ ఏఎంఓలు చంద్రమోహన్, మాధవరెడ్డి, సాల్ట్ కార్యక్రమం జిల్లా కో–ఆర్డినేటర్ అబ్రహం లింకన్ పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత పాటించాలి

ఆత్మకూరు: పరిసరాల శుభ్రత పాటించాలని డీపీఎమ్‌యూ జిల్లా బృందం సూచించింది. బుధవారం స్థానిక జూనియర్ ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు డయేరియాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డయేరియా వ్యాప్తి, లక్షణాలను వివరించారు. విద్యార్థులు తమవంతుగా గ్రామాల్లో డయేరియా వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించాలన్నారు. అతిసారం నివారణ, నీరు పొదుపు పద్ధతులపై చర్చించారు. దోమలు వృద్ధి చెందకుండా డ్రై డే పాటించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ సబిహా సుల్తానా, ధనుంజయ, మూర్తి, సీహెచ్ఓ ప్రీతి, ఆశావర్కర్ రమణమ్మ పాల్గొన్నారు.

అభాగ్యుడికి చేయూత



హరిజన పోతన్నకు ఆర్థికసాయం అందజేస్తున్న తరిమెల రమణారెడ్డి

అనంతపురం కల్చరల్: అమ్మ సంస్థ నిర్వాహకుడు తరిమెల రమణారెడ్డి ఓ అభాగ్యుడికి ఆర్థికసాయం అందజేసి. మానవత్వం చాటుకున్నారు. వివరాలు నగరానికి చెందిన హరిజన పోతన్న, నాగమణి దంపతులు. చెప్పులు కుట్టుకుంటూ జీవించేవారు. పోతన్నకు అప్పుడప్పుడు కడుపు నొప్పి వస్తుండటంతో సాధారణ అనారోగ్యమే అనుకున్నాడు. ఒకరోజు తీవ్రమైన ఉబ్బరంతో కర్నూలులోని ఓ గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఆస్పత్రిలో చేరాడు. గుండెలో రంధ్రం ఉదని, దీర్ఘకాలికంగా ప్రాంకియాన్ ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్నట్లు వైద్యులు గుర్తించారు. ఆపరేషన్‌కు రూ.2.50 లక్షలు ఖర్చు అవుతుందని తెలిపారు. చేతిలో చిల్లగవ్వలేని పోతన్న కుటుంబం ఆర్థికపరిస్థితి తలచుకుని అల్లాడిపోయింది. విషయం తెలుసుకున్న అమ్మ సంస్థ రమణారెడ్డి మానవత్వంతో స్పందించారు. తక్షణసాయంగా బుధవారం రూ.2 లక్షలు అందజేశారు. భవిష్యత్తులోనూ అండగా ఉంటానని భరోసా ఇవ్వడంతో రమణారెడ్డికి పోతన్న కృతజ్ఞతలు తెలిపాడు.

ప్రాచీన హస్తకళలను ప్రోత్సహించండి



హస్తకళా ఉత్పత్తులపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: భారతీయ సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పట్టే హస్తకళలను ప్రోత్సహించాలని లేపాక్షి ఎంపోరియం మేనేజర్ శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు. నగరంలో ఐదు రోజుల పాటూ సాగే హస్తకళల ఉత్పత్తుల ప్రదర్శన బుధవారం ప్రారంభమైంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి అనంతకు విచ్చేసిన కొండపల్లి బొమ్మలు, సంప్రదాయ అద్దకాలు, తోలుతో చేసిన వస్తువులు, వివిధ రకాల దేవతామూర్తుల, కళాఖండాల అమరికలు, లోహపు వస్తువులు ఆకట్టుకుంటున్నాయి. ఈ సందర్భంగా ఎంపోరియం అధికారులు మాట్లాడుతూ.. కళాకారులు శతాబ్దాలుగా వస్తున్న తమ హస్తకళను మరుగున పడకుండా కాపాడుతున్నారన్నారు. కృత్రిమంగా యంత్రాలపై తయారైన వస్తువులతో పోలిస్తే హస్తకళా ఉత్పత్తులు నాణ్యంగా ఉంటాయని పేర్కొన్నారు. కళాభిమానులు బారులు తీరి హస్తకళా ప్రదర్శనను తిలకించారు. లేపాక్షి సిబ్బంది కాటమయ్య, సురేష్, అమరనాథ్, నాగార్జున పాల్గొన్నారు.

సర్దుకుపోతేనే సంసారం సుఖమయం



జంటకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఏపీ మహిళా కమిషన్ సభ్యురాలు రొఖియా బేగం

అనంతపురం సిటీ: సర్దుకుపోతేనే సంసారం సుఖమయం అవుతుందని ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ సభ్యురాలు లయన్ డా.షేక్ రొఖియా బేగం అన్నారు. బుధవారం నగరంలోని సఖీ వన్‌స్టాప్ సెంటర్‌ను సందర్శించారు. అప్పటికే మనస్పర్థలతో వచ్చిన రెండు జంటలకు ఆమె వేర్వేరుగా కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతపురంలోని భగత్‌సింగ్ నగర్‌కు చెందిన ఓ జంటను పిలిచి మాట్లాడారు. తొమ్మిదేళ్ల కిందట తమకు వివాహం కాగా.. ఇద్దరు పిల్లలు ఉన్నారని బాధితురాలు తెలిపింది. అయితే తన భర్త తాగుడుకు బానిసై తనను, పిల్లలను నిర్లక్ష్యం చేస్తున్నట్లు ఫిర్యాదు చేసింది. పరిస్థితిని గమనించిన కమిషన్ సభ్యురాలు చలించిపోయారు. వ్యసనాలతో జీవితం ఎంత నరకంగా ఉంటుందో వివరించారు. భార్యా బిడ్డలతో హాయిగా సాగిపోవాల్సిన సంసారంలో తాగుడు ఎంత చిచ్చుపెట్టిందో విడమర్చి చెప్పారు. ఆలోచించుకుని రావాల్సిందిగా కాస్త సమయం ఇచ్చారు. తాగుడుకు బానిసై తాను ఇంతకాలం ఏం కోల్పోయానో అర్థమైందంటూ తప్పు ఒప్పుకున్నాడు. ఇక నుంచి భార్యా బిడ్డలను చక్కగా చూసుకుంటాననంటూ ప్రమాణం చేశాడు. ఆ తరువాత అనంతపురం తపోవనం ప్రాంతానికి చెందిన అమ్మాయి, తాడిపత్రికి చెందిన అబ్బాయి ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. ఏడాది తిరక్కనే వారి మధ్య మనస్పర్థలు వచ్చాయి. తనకు న్యాయం చేయాలని బాధితురాలు మహిళా కమిషన్ సభ్యురాలిని కోరారు. రెండు వర్గాలను పిలిచి విడివిడిగా విచారించారు. ఆ తరువాత ఇద్దరికీ కౌన్సెలింగ్ ఇచ్చారు. వారం రోజులు గడువు ఇవ్వాలని అబ్బాయి కోరగా.. అందుకు అంగీకరించారు.

సఖీ సెంటర్‌లో కౌన్సెలింగ్‌తో ఇబ్బంది..

మహిళా పోలీస్ స్టేషన్‌లో ఇవ్వాల్సిన కౌన్సెలింగ్‌ను సఖి సెంటర్‌లో ఎందుకు ఇస్తున్నారని మహిళా కమిషన్ సభ్యురాలు ప్రశ్నించారు. ఆస్పత్రికి వచ్చే రోగులు, వారి సహాయకులతో పాటు సఖి సెంటర్‌కు వచ్చే బాధితులకు చాలా అసౌకర్యంగా ఉందన్నారు. సఖి సెంటర్‌లో కాకుండా మహిళా పోలీస్ స్టేషన్‌లోనే కౌన్సెలింగ్ ఇచ్చేలా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పారా లీగల్ ఎ.శ్రీకళ, పారా మెడికల్ పర్సనల్ ఆర్.రాజ్యలక్ష్మి, కేస్ వర్కర్లు కె.మంజుల, వి.దుర్గమ్మ, ఐటీ ఉద్యోగి ఎ.పృథ్వీ కిరణ్‌బాబు, ఎస్ఐ పద్మావతి, మహిళా కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

రేపు సర్వసభ్య సమావేశం

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈనెల 12న ఉదయం 10:30 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ పుల్లయ్య బుధవారం తెలిపారు. ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యుడు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండలస్థాయి అధికారులకు సమాచారం ఇచ్చినట్లు పేర్కొన్నారు. మొత్తం 15 అజెండా అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులు





పి.యాలేరులో జేసీబీతో పనులు చేయిస్తున్న దృశ్యం, మురుగు కాలువలు శుభ్రం చేస్తున్న పంచాయతీ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

ఆత్మకూరు: మండలంలోని పలు గ్రామాల్లో పారిశుధ్యం పడకేయడంతో బుధవారం సాక్షిలో అస్తవ్యస్తంగా పారిశుధ్య నిర్వహణ శీర్షికతో కథనం ప్రచురితమైంది. స్పందించిన పి.యాలేరు పంచాయతీ సెక్రటరీ ఖాదర్‌వలి బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు జేసీబీతో మురుగు నిల్వ ఉన్న ప్రదేశాల్లో పూడిక తీయించారు. మురుగు నీరు సజావుగా వెళ్లేలా శుభ్రం చేయించారు. అనంతరం పంచాయతీ సిబ్బందితో మురుగు కాలువల్లో చెత్తను తొలగించారు. గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టారు. గ్రామంలో ఎక్కడా మురుగు లేకుండా చర్యలు తీసుకుంటామని పంచాయతీ సెక్రటరీ తెలిపారు.

ఉపాధి కూలీల హాజరు పెంచండి



మాట్లాడుతున్న ఏపీఓ ఓబన్న

రాప్తాడు: మండల వ్యాప్తంగా 16 గ్రామ పంచాయతీల్లో ఉపాధి కూలీల హాజరును పెంచాలని ఏపీఓ ఓబన్న సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ కూలీల హాజరు, హార్టికల్చర్ పనులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఉపాధి లక్ష్యాలను చేరుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పండ్ల మొక్కల సాగుకు చిన్న, సన్నకారు రైతులు దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఐదె ఎకరాల వరకు చీనీ, దానిమ్మ, జామ, అల్ల నేరేడు, నిమ్మ తదితర పండ్ల మొక్కఅల పెంపకం నిర్వహణకు మూడేళ్ల వరకు బిల్లులను ప్రభుత్వమే భరిస్తుందన్నారు. ఆసక్తి గల రైతులు ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. మరిన్ని వివరాలకు 99639 09929 నంబర్‌కు సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్స్ తదితరులు పాల్గొన్నారు.

హంతకుల్ని త్వరలో పట్టుకుంటాం



హత్య జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ గౌతమి శాలి

రాయదుర్గం: రాయదుర్గం మండలం మెచ్చిరి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు ఆదెప్ప హత్య ఘటనపై ఎస్పీ గౌతమిశాలి విచారణ చేపట్టారు. బుధవారం రాత్రి హత్య జరిగిన ప్రాంతాన్ని కళ్యాణదుర్గం డీఎస్పీ బీ శ్రీనివాసులు, అర్బన్ సీఐ శ్రీనివాసులతో కలసి పరిశీలించారు. డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీమ్ రాబట్టిన ప్రాథమిక వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ... ఆదెప్ప హంతకులను వీలైనంత త్వరగా పట్టుకుంటామన్నారు. ఈ కేసులో ఎవర్నీ వదలకుండా దర్యాప్తును మరింత ముమ్మరం చేయిస్తామన్నారు. నిందితులకు శిక్ష పడేలా తగిన ఆధారాలు సేకరించాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో ఎక్కడా ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా పటిష్ట చర్యలు చేపడతామన్నారు. ఇప్పటికే రెండు బృందాలను రంగంలోకి దించామని వివరించారు. గ్రామంలో ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పికెట్ కొనసాగించాలన్నారు.